




> ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ మరో రాజకీయ కక్షపూరిత చర్య. కవిత బలమైన మహిళా నాయకురాలు. ఆమె అరెస్ట్‌పై ఆమెతో కలిసి పోరాడతా. బీజేపీ వ్యతిరేక స్వరాలను బెదిరించి లొంగదీసుకోవడంలో భాగమే ఈ అరెస్టులు. ఈ ఘటన దురదృష్టకరం. బీజేపీ అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుంది. ఎంత అణిచివేయడానికి ప్రయత్నించినా ఆపేది లేదు.
>
> - ప్రియాంక చతుర్వేది, శివసేన ఎంపీ

# ఎమ్మెల్సీ కవిత అరెస్టు

- ఢిల్లీ మద్యం కేసులో అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు
- మధ్యాహ్నం నుంచి ఆరు గంటల పాటు ఆమె ఇంట్లో సోదాలు
- సాయంత్రం ట్రాన్సిట్ వారంట్ లేకుండానే అదుపులోకి..?
- ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై మండలి చైర్మన్‌కు సమాచారం
- రాత్రి 8.45కి ఢిల్లీకి కవిత తరలింపు



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను వాహనంలో ఎయిర్‌పోర్ట్‌కు తరలిస్తున్న ఈడీ అధికారులు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అత్యంత నాటకీయంగా.. పక్కా పథకం ప్రకారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. ఎలాంటి ట్రాన్సిట్ వారంట్ లేకపోయినా కవితను అదుపులోకి తీసుకున్న ఈడీ.. రాత్రి 8.45కు ఢిల్లీకి తరలించారు. పన్నెండు మంది ఈడీ అధికారుల బృందం శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకే కవిత ఇంటి వద్ద మోహరించింది. సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ వాయిదా పడిన వెంటనే 1.45 గంటలకు కవిత ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లోకి రావడంతోనే సెక్యూరిటీ సిబ్బంది ఫోన్లు, కవిత వ్యక్తిగత సిబ్బంది ఫోన్లు, కవిత ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తనిఖీల పేరుతో ఆమె ఇంట్లో నానా హంగామా సృష్టించిన ఈడీ అధికారులు.. డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం 6.45 గంటల వరకూ సోదాల పేరుతో కాలయాపన చేశారు. కవిత ఇంట్లో సోదాలు జరుగుతున్నాయనే సమాచారం మీడియాకు చేరుకునేలోపే ఇంటి మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

### ఐటీ పేరుతో మీడియాను దారిమళ్లించి..

కవిత ఇంట్లో సోదాలు జరుపుతున్నది ఇన్‌కం ట్యాక్స్ అధికారులంటూ బీజేపీ అనుకూల మీడియా వార్తలు ప్రసారం చేసింది. మధ్యాహ్నం 4 గంటల వరకూ కవిత ఇంట్లో సోదాలు జరుపుతున్నది ఈడీ అధికారులనే విషయం తెలియరాలేదు. చాలా పకడ్బందీగా మీడియాను సైతం తప్పుదోవ పట్టించారు.

సాయంత్రం 4 గంటల సమయంలో ఈడీ అధికారులు కవిత స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. కవిత భర్త అనిల్‌కు ట్యాబ్లెట్లు ఇచ్చేందుకు పనిమనుషులను కూడా అనుమతించలేదు. బీఆర్ఎస్ లీగల్ టీమ్‌కు చెందిన సోమ భరత్‌కుమార్ సుప్రీంకోర్టు తీర్పులతో ఆమె ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. కనీసం గేటు కూడా తెరవకపోవడంతో ఆయన వెనుదిరిగారు. మళ్లీ ఆయనను పిలిపించి.. సోదాలు మాత్రమే జరుపుతున్నామని నమ్మించారు. సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతుండగా.. అనుమతులు లేకుండా సోదాలు ఎలా చేస్తారని తాను ఈడీ అధికారులను ప్రశ్నించినట్టు సోమభరత్ మీడియాకు చెప్పారు. బీఆర్ఎస్, భారత జాగృతి కార్యకర్తలు, మాజీ నేతలు పెద్ద ఎత్తున కవిత ఇంటికి చేరుకొని, రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

### కేటీఆర్, హరీశ్‌కూ అనుమతి నిరాకరణ

కవిత ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు జరుపుతున్నారనే విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి అక్కడికి చేరుకోగా, వారికి సైతం అనుమతి నిరాకరించారు. కార్యకర్తలు ఒక్కసారిగా గేటు వద్దకు దూసుకురావడంతో ఉద్రిక్తత నెలకొన్నది. 'ఇదేమి దౌర్జన్యం కనీసం నా చెల్లిని కూడా చూడనివ్వరా' అంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ గేటు తెరిచే ప్రయత్నం చేశారు. హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్, జాగృతి కార్యకర్తలంతా కేటీఆర్ వెనుక నిలువగా.. పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. పరిస్థితి చేయిదాటేలా కనిపించడంతో ఈడీ అధికారులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డిని లోపలికి అనుమతించారు. లోపలికి వెళ్లిన కేటీఆర్.. వివరాలు తీసుకొని ట్రాన్సిట్ వారంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారని ఈడీ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ భానుప్రియ మీనాను ప్రశ్నించారు.

### అదే చెరగని చిరునవ్వుతో..

సాయంత్రం వరకూ కవిత అరెస్టు విషయాన్ని దాచిపెట్టిన ఈడీ అధికారులు.. సాయంత్రం 5 గంటల తర్వాత శాసనమండలి చైర్మన్‌కు సమాచారం ఇచ్చారు. ఆమెను నిబంధనల ప్రకారం, పక్కా ఆధారాలతో అరెస్టు చేస్తున్నామని ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగీందర్ తెలిపారు. అనంతరం కవితను 5.20కి అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. దాదాపు 14 పేజీలతో కూడిన రిపోర్టును కవితకు అందజేశారు. తన వాదనకు వ్యతిరేకంగా అరెస్టు చేస్తున్నా.. ఎమ్మెల్సీ కవిత శాంతియుతంగా వారికి సహకరించారు.

### అభివాదం చేస్తూ ముందుకు..

**ఇంటినుంచి** బయలుదేరేముందు ఎమ్మెల్సీ కవిత పిడికిలి ఎత్తి నినదించారు. ఆమెను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకొని కారులో ఢిల్లీకి తరలించేందుకు సిద్ధమవగా.. చిన్న కొడుకు ఆదిత్యను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఆదిత్య నుదుటిపై ముద్దు పెట్టి, ధైర్యం చెప్పారు. కొడుకు కన్నీటి పర్యంతమవుతుండగా తలనిమిరి.. వెన్నుతట్టి సముదాయించారు. మెట్లు దిగుతూ చిరునవ్వుతో అభివాదం చేస్తూ కవిత ముందుకు కదిలారు. అనంతరం కారు ఎక్కేముందు భర్త అనిల్‌ను హత్తుకొని ఉద్వేగానికి గురయ్యారు. కాసేపు మేడే రాజీవ్‌సాగర్, శరత్‌తో మాట్లాడారు. కవిత అరెస్టుపై నిరసనలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, నాయకులు, పలు కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మేడే రాజీవ్‌సార్, ఆంజనేయులుగౌడ్, నాయకులు రజినీ, గట్టు రామచంద్రయ్య, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సాయంత్రం 5:20 గంటలకు అరెస్ట్

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవితను శుక్రవారం సాయంత్రం 5:20 గంటలకు అరెస్ట్ చేసినట్టు ఈడీ అధికారులు తెలిపారు. ఐదు గంటలపాటు సోదాలు జరిగాయని, ఈ ప్రక్రియ మొత్తానికి కవిత సంపూర్ణంగా సహకరించారని చెప్పారు. ఈ మేరకు అరెస్ట్ ఆర్డర్, పంచనామా నివేదికల్లో పేర్కొన్నారు. వీటి ప్రకారం.. ఈడీ అధికారులు కవితకు ఈ నెల 14 ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) లోని సెక్షన్ 17 కింద నోటీసులు జారీచేశారు. ఆ మేరకు శుక్రవారం మధ్యాహ్నం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని ఆమె నివాసానికి వచ్చారు. అధికారులు తమను పరిచయం చేసుకొని, సెర్చ్ వారంట్‌ను చూపించారు. ఎందుకు సోదాలు చేయాలనుకుంటున్నారో వివరించారు. సోదాలు చేసేముందు.. కావాలనుకుంటే తమను చెక్ చేసుకోవచ్చని అధికారులు చెప్పగా.. కవిత సున్నితంగా తిరస్కరించారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ జోగెందర్ ఆధ్వర్యంలో ఇంట్లో సోదాలు నిర్వహించారు. మధ్యాహ్నం 1:45 గంటలకు ప్రారంభమైన సోదాలు సాయంత్రం 6:45 గంటలకు ముగిశాయి. ఈ క్రమంలో కవిత స్టేట్‌మెంట్‌ను సైతం వారు రికార్డ్ చేసుకున్నారు. ఈసందర్భంగా ఐదు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం 5:20 గంటలకు కవితను అరెస్ట్ చేశారు. అరెస్ట్ ఆర్డర్‌ను ఆమెకు అందించారు. పీఎంఎల్‌ఏలోని సెక్షన్ 3, సెక్షన్ 4 ప్రకారం అరెస్ట్ చేయడానికి తగిన కారణాలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. అరెస్ట్‌కు సంబంధించి కవిత భర్త డీఆర్ అనిల్‌కుమార్‌కు సమాచారం ఇచ్చినట్టు 'ఇంటిమేషన్ ఆఫ్ అరెస్ట్'లో వెల్లడించారు. సాయంత్రం 6 గంటలకు కవిత సోదరుడు (కేటీఆర్), లాయర్లు, ఇతర సభ్యులు 20 మంది అనుమతి లేకుండాలోపలికి వచ్చారని ఆరోపించారు. సోదాలు పూర్తి శాంతియుతంగా సాగాయని, అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదని, కొవిడ్ ప్రొటోకాల్ కూడా పాటించామని పంచనామా నివేదికలో పేర్కొన్నారు. ఈ సోదాల్లో ఈడీ డిప్యూటీ డైరెక్టర్ భానుప్రియ మీనా, అసిస్టెంట్ డైరెక్టర్లు జోగీందర్, సుమిత్ గోయల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కార్తీక్ మెహ్రా, హిమాన్షు చౌదరి, మమత నారా, సెపాయ్, బ్రజేశ్ చౌరాసియా, వరలక్ష్మి తుమ్మొజె పాల్గొన్నారు.



కవిత ఇంటిలోనికి అనుమతించకపోవడంతో గేటు వద్దే ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు

## ట్రాన్సిట్ వారంట్ లేకుండా ఎలా అరెస్ట్ చేస్తారు?

- అరెస్ట్ చేయబోమని కోర్టుకు చెప్పి మాట ఎలా తప్పుతారు
- ఈడీ అధికారులను నిలదీసిన మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 15(నమస్తే తెలంగాణ): ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎమ్మెల్సీ కవితను ఎలా అరెస్ట్ చేస్తారంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఈడీ అధికారులను నిలదీశారు. కవితను అరెస్ట్ చేసేందుకు వచ్చిన ఈడీ అధికారులతో కేటీఆర్ వాదనకు దిగారు. పలు అంశాలపై ఈడీ అధికారిణి భానుప్రియ మీనాను ప్రశ్నించారు. కవిత అరెస్ట్ విషయాన్ని తెలుకున్న కేటీఆర్ మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి బంజారాహిల్స్‌లోని కవిత ఇంటికి వచ్చారు. అయితే వీరిని ఇంట్లోకి రానివ్వకుండా పోలీసులు గేట్లు మూసేసి అడ్డుకున్నారు. చాలా సమయంపాటు అక్కడే వేచి చూసిన కేటీఆర్, హరీశ్‌రావును చివరికి ఇంట్లోకి అనుమతించారు. ఇంట్లోకి వెళ్లిన కేటీఆర్.. విచారణ అధికారి భానుప్రియ మీనాతో మాట్లాడారు. బహిరంగంగానే ఆమెపై ప్రశ్నల వర్షం కురిపించారు. కవితను అరెస్ట్ చేయబోమని సుప్రీంకోర్టుకు మాటిచ్చిన ఈడీ.. ఇప్పుడెలా అరెస్ట్ చేస్తున్నదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు ఇచ్చిన మాటను తప్పుతున్న ఈడీ అధికారులు కోర్టు ద్వారా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బెయిల్ రాకుండా కుట్ర చేసిన అధికారులు కావాలనే శుక్రవారం నాడు అరెస్ట్ చేశారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంట్లోకి రాకుండా నిర్బంధం విధించారని మండిపడ్డారు. సోదాలు ముగిసిన తర్వాత కూడా ఇంట్లోకి రావద్దు అంటూ ఈడీ అధికారులు తమకు హుకుం జారీ చేయడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తొందరపాటు, దుందుడుకు చర్యలపై ఈడీ సుప్రీంకోర్టుకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని కేటీఆర్ అన్నారు. కవిత అరెస్ట్ అనంతరం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు.

### ట్రాన్సిట్ వారంట్ అంటే?

కవితను ట్రాన్సిట్ వారంట్ లేకుండానే అదుపులోకి ఎలా తీసుకున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అసలు 'ట్రాన్సిట్ వారెంట్' అంటే ఏంటో తెలుసుకుందాం. ఏదైనా కేసులో నిందితుడి మీద ఒక రాష్ట్రంలో ఎఫ్ఐఆర్ రిజిస్టర్ నమోదు చేస్తే.. అతడు వేరే రాష్ట్రంలో ఉన్నప్పుడు అరెస్ట్ చేసి, కేసు నమోదైన రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు తప్పనిసరిగా స్థానిక కోర్టు అనుమతి తీసుకోవాలి. దాన్నే 'ట్రాన్సిట్ రిమాండ్ ఆర్డర్' అని అంటారు. ఎమ్మెల్సీ కవిత మీద ఢిల్లీలో కేసు రిజిస్టర్ అయింది. అయితే ఆమెను ఈడీ అధికారులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. ముందుగా ఆమెను స్థానిక కోర్టులో ప్రవేశపెట్టాలి. కోర్టు ట్రాన్సిట్ ఆర్డర్ ఇస్తే అప్పుడు కవితను ఢిల్లీకి తీసుకెళ్లొచ్చు. కానీ, ఈ పద్ధతులేవీ పాటించకుండా కవితను ఢిల్లీకి తరలించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

## అరెస్ట్ చట్ట విరుద్ధం

**న్యాయ పోరాటం చేస్తాం: సోమా భరత్ కుమార్**

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేయడం.. ఆ సంస్థ సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీకి వ్యతిరేకమని లాయర్ సోమా భరత్ అన్నారు. కవిత నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆమె అరెస్ట్ చట్టవిరుద్ధమని చెప్పారు. ఈడీ అధికారులు నిబంధనలు పాటించలేదని తెలిపారు. ఒక మహిళను రాత్రివేళ అరెస్టు చేయడం దుర్మార్గమని అన్నారు. న్యాయమూర్తి నుంచి వారంట్ తీసుకోకుండా అరెస్టు చేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. కవిత అరెస్టుకు గల కారణాలను తెలపాలని కోరినా ఈడీ అధికారులు పట్టించుకోలేదని అన్నారు. సుప్రీంకోర్టుకు ఇచ్చిన అండర్‌టేకింగ్‌ను ఈడీ అతిక్రమించిందని చెప్పారు. మహిళను ఈడీ అరెస్ట్ చేసే అంశంపై కోర్టులో విచారణ జరుగుతున్నదని, అది పూర్తికాకుండానే ఈడీ కవితను అదుపులోకి తీసుకుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కేసు సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణకు వచ్చిందని, ధర్మాసనం ఈ నెల 19కి వాయిదా వేసిందని, అప్పటివరకు వేచి చూడలేని ఈడీ అధికారులు అరెస్ట్ చేయడం దుర్మార్గమని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టంచేశారు.

## మాటమార్చి.. అరెస్టు చేసి

**అడ్వకేట్ మోహిత్‌రావు**

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ చట్టవిరుద్ధమని అడ్వకేట్ మోహిత్‌రావు పేర్కొన్నారు. అరెస్ట్ విషయంలో ఈడీ చట్టవిరుద్ధం గా వ్యవహరించిందని విమర్శించారు. ట్రాన్సిట్ వారెంట్ లేకుండానే అరెస్ట్ చేశారని తెలిపారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే ఇదంతా జరిగిందని, విమాన టికెట్లను ముందుగా బుక్ చేయడమే అందుకు నిదర్శనమని తెలిపారు. కవిత అరెస్టు నేపథ్యంలో మోహిత్‌రావు శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కేసును సుప్రీంకోర్టు మంగళవారానికి వాయిదా వేసిందని, కేసు పూర్తయ్యే వరకు కవిత పై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోమని ఈడీ గతంలో చెప్పిందని గుర్తుచేశారు. కవిత అరెస్ట్‌ను కోర్టులో సవాలు చేస్తామని తెలిపారు. న్యాయపోరాటం చేస్తామని, న్యాయవాదులతో చర్చించి శనివారం నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

## రాజకీయ కక్షతోనే కవిత అరెస్టు

**సోషల్ మీడియాలో నెటిజన్ల ఆగ్రహం**

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 15 (నమస్తే తెలంగాణ): కల్వకుంట్ల కవిత అరెస్టుపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఆమెను అరెస్టు చేశారంటూ మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై, వికృత రాజకీయాలకు పాల్పడుతున్నారని పోస్టులు చేశారు. ఈడీ సోదాల విషయం తెలుసుకున్న నెటిజన్లు ప్రారంభం నుంచే కవితకు మద్దతుగా పోస్టులు పెట్టారు.

## నేడు బీఆర్ఎస్ నిరసనలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్‌కు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే ధర్నాలు, నిరసన కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు, మహిళలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని, కేంద్రానికి నిరసన తగలాలని సూచించింది. మహిళా సంఘాలు, సంస్థలు, మహిళలు పెద్దఎత్తున హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించింది. కేంద్రం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని అందులో భాగంగానే కవితను అరెస్ట్ చేసిందని పార్టీ ఆరోపిస్తున్నది. లిక్కర్ కేసుకు కవితకు సంబంధం లేకపోయినా బీఆర్ఎస్, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని రాజకీయంగా ఇరుకున పెట్టాలనే ఉద్దేశంతో కవితను అరెస్ట్ చేశారని విమర్శిస్తున్నది.

## బీఆర్ఎస్‌ను భయపెట్టేందుకే!

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో బీజేపీ సర్కార్ పన్నిన ఎన్నికల జిమ్మిక్కు నగ్నంగా బయటపడిందా? అంటే అవునంటున్నారు రాజకీయ పరిశీలకులు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ఒకరోజు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ అరెస్టు చేయటమే అందుకు కారణం. ఒకవైపు ఈ కేసుపై ఈ నెల 19న సుప్రీంకోర్టులో విచారణ ఉన్నప్పటికీ, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ కవితను అరెస్టు చేయటంపై రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం అరెస్టు చేస్తే సోమవారం వరకు బెయిల్ పిటిషన్‌కు అవకాశం లేకుండా ఈడీ వ్యవహరించిందని, ఇది ముందస్తు వ్యూహమేనని అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఒక మహిళను ఇంటి వద్దే విచారణ జరపాలని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం భార్య నళినీ చిదంబరం కేసులో ఈడీకి న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఇదే అంశంపై కవిత న్యాయపోరాటం

- కవిత అరెస్టు ఎన్నికల జిమ్మిక్కు!
- ఎన్నికల షెడ్యూల్‌కు ముందురోజే
- బలపడేందుకు బీజేపీ ఎత్తులు?
- బీఆర్ఎస్‌ను బలహీనపర్చే చర్యలు!
- 'ముందు ఈడీ, తర్వాత మోదీ' మాట నిజమైంది
- లబ్ధి కోసమే అంటున్న పరిశీలకులు

చేస్తున్నారు. అయినా ఇవేవీ పరిగణనలోకి తీసుకోకుండా ఈడీ ఏకపక్షంగా వ్యవహరించిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### టక్కుటమార విద్యలు బీజేపీకి కొత్తకాదు

'రాజకీయ ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేయటం, లొంగదీసుకోవటం బీజేపీ సర్కార్‌కు కొత్తేమీ కాదు. ఇలాంటి టక్కుటమార విద్యలను అనేక సందర్భాల్లో ప్రయోగించింది. ఇదే కేసులో ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు వరుసబెట్టి ఈడీ నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఆ పార్టీ సీనియర్ నేత సిసోడియాను అరెస్టు చేసి జైలులో పెట్టింది. కవిత అరెస్టు కాకతాళీయమా? పథకం ప్రకారం జరిగిందా? అనేది పక్కన పెడితే, కేంద్రం తమ రాజకీయ ప్రత్యర్థులను లొంగదీసుకునేందుకు 'ముందు ఈడీ వస్తది.. తర్వాత మోదీ వస్తడు' అన్న మాట అక్షరాల నిజమైంది. ఈడీ బృందం శుక్రవారం కవిత ఇంటికి రాగా, సాయంత్రం హైదరాబాద్‌కు ప్రధాని మోదీ వచ్చారు' అని పరిశీలకులు చెప్తున్నారు.

### ఎన్నికల్లో లబ్ధి కోసమే!

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనన్న ప్రచారాన్ని కాంగ్రెస్, ఇతర పార్టీలు విస్తృతం చేశాయి. దీని వల్లే తమకు అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన సీట్లు రాలేదని బీజేపీ నేత ల వాదన. ఈ అభియోగం నుంచి బయటపడకపోతే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే జరుగుతుందన్న భయంతో కవితను ఈడీ అరెస్టు చేసి ఉంటుందని విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# విపక్షాలపై బీజేపీ ఈడీ అస్త్రం

దారికి తెచ్చుకోడానికి ఈడీ, ఐటీ, సీబీఐతో దాడులు • రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగ సంస్థల దుర్వినియోగం

ప్రతిపక్షాలను రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యం • కాషాయ కండువా కప్పుకోగానే కేసులన్నీ మాయం

మొత్తం కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష నాయకులపైనే • నేరారోపణలు రుజువైన కేసులు 0.5% కంటే తక్కువే

**విమర్శిస్తే.. ఈడీ**

**ఎదురుతిరిగితే.. ఐటీ**

**విధానాలను ఎండగడితే.. సీబీఐ**

**అయినా దారికి రాలేదో.. ఈడీ+ఐటీ+సీబీఐ**

కేంద్రంలోని బీజేపీ సర్కారు విపక్ష నేతలే లక్ష్యంగా గత పదేండ్ల నుంచి సాగిస్తున్న దమనకాండ ఇది.


రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయ పన్ను శాఖ (ఐటీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) లాంటి రాజ్యాంగ సంస్థలను కీలుబొమ్మలుగా మార్చుకొని మోదీ సర్కారు చేస్తున్న దురాగతాలు తారాస్థాయికి చేరాయి.

**ఢిల్లీ మద్యం పాలసీలో అసలు కుంభకోణం ఎక్కడ ఉన్నది? అంటూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు గతంలోనే ఈడీని సూటిగా ప్రశ్నించి, మొట్టికాయలు కూడా వేసింది.**

**తలా తోకా లేని ఈ కేసును పట్టుకొని శుక్రవారం ఈడీ అధికారులు బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాసంలో సోదాలు నిర్వహించారు. ఒకవైపు సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగానే.. అవేమీ పట్టించుకోకుండా కవితను అరెస్టు చేశారు. దీన్ని రాజకీయ కక్షసాధింపుల్లో పరాకాష్ఠగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

*హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ప్రతిపక్షాలను అణచివేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు చేస్తున్న దురాగతాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. ఏదో ఓ ఆరోపణను తెరమీదకు తీసుకురావడం.. విపక్ష నేతలు, వారి సన్నిహితుల ఇండ్లల్లో సోదాలు జరుపడం.. వేధింపులకు గురిచేయడం.. ఇదీ గత పదేండ్ల నుంచి నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్నీతి. 2014లో ప్రధానిగా మోదీ గద్దెనెక్కినప్పటి నుంచి ఇప్పటివరకు ఈడీ, సీబీఐ, ఐటీ నమోదు చేసిన కేసుల్లో ప్రతిపక్ష నాయకులు, వారి సన్నిహితుల మీదే 95% ఫైల్ అయ్యాయి. వాటిలో కేవలం 0.46% కేసులు మాత్రమే రుజువయ్యాయి. మొత్తం కేసుల్లో కనీసం 0.5% కూడా రుజువు కాకపోవడాన్ని విశ్లేషిస్తే.. ప్రజాక్షేత్రంలో ప్రతిపక్ష నాయకులను దెబ్బతీసి, రాజకీయంగా కుంగదీసేందుకు మోదీ సర్కారు ఉద్దేశపూర్వకంగా ఈ కేసులను నమోదు చేస్తున్నట్టు అర్థమవుతున్నది. కేసులు, దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కొన్న నేతలు.. బీజేపీలో చేరగానే సచ్చీలురైపోతున్నారు. దీంతో అప్పటివరకూ దూకుడుగా వ్యవహరించిన ఈడీ, ఐటీ, సీబీఐ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ హఠాత్తుగా కనిపించకుండా పోతున్నాయి.*



**పదేండ్ల పాలనలో విపక్షాలపై కక్షసాధింపులు ఇలా..**

- పీఎంఎల్‌ఏ తదితర సెక్షన్ల కింద ఈడీ పెట్టిన కేసులు: 5,906
- ప్రతిపక్ష నాయకులపై నమోదు చేసిన కేసులు: 5,150
- శిక్ష పడ్డవారు/రుజువైన కేసులు: 24
- పదేండ్లలో సీబీఐ కేసులు: 124
- ప్రతిపక్ష నాయకులపై నమోదు : 118
- ఈడీ, సీబీఐ ఫైల్ చేసిన మొత్తం కేసుల్లో ప్రతిపక్ష నాయకులపై నమోదైన కేసులు: 95%
- వాటిలో నేరనిరూపణ జరిగి శిక్షపడినవారు: 0.42%
- ఇంకా నేరనిరూపణ కాని/విచారణ దశలో ఉన్న కేసులు: 99.54%

### బీజేపీలో చేరాక కేసులు మాయం

1. **నారాయణ్ రాణె:** మనీలాండరింగ్ కేసులో ఈడీ వేటాడింది. 2017లో బీజేపీకి అనుబంధంగా సొంత పార్టీ పెట్టుకోవడంతో దాడులు ఆగాయి. కేంద్ర మంత్రి పదవిని చేపట్టి 2019లో పార్టీని బీజేపీలో విలీనం చేశారు.
2. **సువేందు అధికారి:** పశ్చిమబెంగాల్‌కు చెందిన టీఎంసీ నేత. శారద మల్టీలెవల్ మార్కెటింగ్ కుంభకోణంలో 2014 నుంచి సీబీఐ పలుమార్లు ప్రశ్నించింది. 2020లో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచీ విచారణ బంద్.
3. **హిమంత బిశ్వశర్మ:** శారద కుంభకోణంలో నిందితుడు. 2014 నవంబర్‌లో సీబీఐ ఆయన ఇంటిలో సోదాలు జరిపింది. 2015 ఆగస్టులో బీజేపీలో చేరారు. ఏకంగా అస్సాం సీఎం అయ్యారు.
4. **ముకుల్ రాయ్:** 2014లో బెంగాల్‌లో లంచాలు తీసుకోవటంపై సంచలనం సృష్టించిన శారద కేసులో నిందితుడు. సీబీఐ పలుమార్లు నోటీసులు ఇవ్వడంతో 2017లో బీజేపీలో చేరారు. విచారణ ఆగింది. పైగా 2021 మేలో ముకుల్‌రాయ్‌కి క్లీన్ చిట్ ఇచ్చింది. ఆ వెంటనే మళ్లీ తృణమూల్‌లో చేరారు.
5. **జ్యోతిరాదిత్య సింధియా:** కాంగ్రెస్‌కు చెందిన జ్యోతిరాదిత్య సింధియాపై భూ ఆక్రమణ కేసులు నమోదయ్యాయి. 2020 మార్చి 10న ఆయన బీజేపీలో చేరగానే మధ్యప్రదేశ్ ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ ఆ కేసును మూసివేసింది.
6. **భావన గవాలీ:** మహారాష్ట్రలో ఠాక్రే శివసేనలో ఉన్నప్పుడు ఆమెకు ఈడీ ఐదుసార్లు నోటీసులిచ్చింది. ఇప్పుడు ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన (బీజేపీ మిత్రపక్షం) ఎంపీగా ఉన్నారు. పార్టీకి చీఫ్‌విప్‌గా కొనసాగుతున్నారు. ఈడీ కేసులు మరుగునపడ్డాయి.
7. **యశ్వంత్ జాదవ్:** యశ్వంత్ జాదవ్, ఆయన సతీమణి యామినీ జాదవ్‌పై ఫెమా ఉల్లంఘనల కింద ఈడీ కేసులు పెట్టింది. షిండే వర్గంలో చేరగానే ఆ కేసులు అటకెక్కాయి.
8. **ప్రతాప్ సర్నాయక్:** శివసేనలో ఉన్నప్పుడు మనీలాండరింగ్ ఆరోపణలతో ఈడీ కేసు నమోదు చేసింది. షిండే సేనలోకి వెళ్లగానే కేసు ఊసే లేకుండా పోయింది.
9. **సుజనా చౌదరి:** టీడీపీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి ఇండ్లు, కంపెనీల్లో 2018 నవంబర్‌లో ఈడీ, 2019 జూన్ 2న సీబీఐ సోదాలు నిర్వహించాయి. ఆయన ఢిల్లీ వెళ్లి జూన్ 20న బీజేపీలో చేరారు. ఆ తర్వాత దాడులు ఆగిపోయాయి.
10. **సీఎం రమేశ్:** టీడీపీకి చెందిన సీఎం రమేశ్‌పై 2018 అక్టోబర్‌లో ఐటీ, 2019 ఏప్రిల్‌లో ఈడీ దాడులు జరిగాయి. ఆయన కూడా బీజేపీలో చేరాక దాడులు ఆగిపోయాయి.